# విషాదయోగం

అన్నం కంచం ముందు కూర్చుని యథాలాపంగా వీధిగుమ్మం వైపు చూశానో లేదో దెయ్యపు నీడ కదిలినట్టు అన్పించి అదిరిపడ్డాను.

"ఏంటయ్యా ఏంటలా ఉలిక్కిపడ్డావ్...?"

ఇల్లాలి మాటలు పట్టించుకోకుండా తేరపారి చూశాను. నీడ 'సెంట్రీ' రూపుదాల్చింది. గుండె పట్టేసింది. ప్రాణాలు ఉగ్గబెట్టుకుని బిక్కు బిక్కు మంటూ చూశాను.

"ఎవరూ" అంటూ గుమ్మం దగ్గరి కెళ్ళింది రత్తాలు.

"అసిరయ్య లేడా" అంటూ చొరవగా లోపలి కొచ్చాడు జైల్లో సెంట్రీగా పన్జేస్తోన్న వీర్రాజు.

లేవబోతోంటే, "అయ్యో - కంచం ముందు నుంచి లేస్తావేంటయ్యా. పోలీసాయన కూర్చుంటాళ్ళే" అంది కంగారుగా.

ఆమె మాటలు వినబడనట్టుగా లేచి వెళ్ళి చేతులు కడుక్కొచ్చాను.

"నిన్ను సూపర్నెంటుగారు కలవమన్నారు, చెప్పిపోదామని వచ్చిన"

ఒంట్లోని రక్తం వరదపోటు తగిలినట్లు పరుగెడుతోంటే అన్నాను "నా పని పడిందా?".

నా స్వరం నాకే చిత్రంగా వుంది!

అదోలా నవ్వేడతడు. "లేకపోతే ఎందుకొస్తాను!"

"రేపు కలుస్తాన్లే..."

"తప్పకుండా రా. లేకపోతే కొంపలంటుకుపోతాయి. వచ్చే వారమే ఎగ్జెక్యూషన్"

అతడెళ్ళిపోయాడు. నేను తుపానులో సర్వం కోల్పోయిన వాళ్ళా కూలబడ్డాను.

"ఇదెక్కడి పీడ! ఏలిన్నాటి శనిలా మనల్ని వదల్టం లేదు..... ఇంకోళ్ళని చూసుకోమనరాదా. ఆళ్ళూ బాగానే వుంటారు ఈళ్ళూ బాగానే వుంటారు, మద్దెన నీ కొచ్చి

పడద్ది సావు!"

"అదేం మాటే. ఎవరి పని ఆళ్ళు సెయ్యాల. ఎవరి దరమం ఆళ్ళది..."

"ఇప్పుడలాగే అంటావ్. రేపటాల్నుంచి అన్నపూఁ తినవు నిద్రా పోవు!" నిష్ఠూరమాడింది.

రత్తమ్మ చెప్పింది అక్షర సత్యం. గత పాతికేళ్ళలో ముగ్గుర్ని ఉరితీశాను. ఆ పని చేసే ముందూ చేశాకా నాకు అనుక్షణం నరకయాతనే. ఏం చెయ్యను? మా అయ్య తలారి. ఇష్టంలేక పోయినా నేనూ అదే వృత్తి చేబట్టక తప్పలేదు!

మర్నాడు జైలు సూపరిండెంటు ముందు చేతులు కట్టుకుని నిలబడ్డాను.

నన్ను చూసి నవ్వేడు. "బాగున్నావా.. నీ పేరేంటీ అసిరి... అసిరయ్య కదూ... బాగానే ఉంటావులే. బాగోకపోడానికి దొబ్బుడాయేంటి. మేం మాత్రం వీఐపీ ఖైదీల్తో వేగలేక ఛస్తున్నాం. వాళ్ళని సరిగ్గా చూస్తే ఒక తంటా చూడకపోతే ఇంకో తంటా. మీడియా వాళ్ళు మా చుట్టూ కెమేరాకళ్ళతో డేగల్లా కాచుక్కూర్చుంటున్నారు. కదిల్నా మెదిల్నా టీవీలో చూపించి ఏకి పారేస్తున్నారు. మాసెడ్డ చావొచ్చి పడింది!"

నేను మాట్లాడాల్సిందేమీ లేనందున మౌనంగా నిలబడ్డాను.

"లోపలి కెళ్ళి నీ సరంజామా సిద్ధం చేసుకో. వచ్చే గురువారం ఉదయం అయిదున్నరకి ముహూర్తం..."

నా వల్ల కాదనీ ఇంకొకర్ని చూసుకోమనీ చెప్పాలని చూశాను. నోరు పెగల్లేదు.

నా తటపటాయింపు చూసి కాబోలు అన్నాడాయన "నువ్వేం జాలి చూపక్కర్లేదు. ఇద్దరు పసిపిల్లల్ని ఘోరంగా చంపిన రాక్షసుళ్ళే. భగవంతుడు నీ రూపంలో దుష్ట శిక్షణ చేస్తున్నాడన్న మాట"

అలా అనేసి ఊరుకుంటే బాగానే వుండేది. ఊరుకో లేదు. అదోలా నవ్వేడు. తేలుకొండెలాంటి నవ్వది. ఒళ్ళంతా కొత్త కత్తితో చీరి కొత్త కారం దట్టించినట్టు..!

ఉరిశిక్ష పడ్డ ఖైదీ బరువు, ఎత్తుతో బాటు వివరాలు కనుక్కున్నాను. అతడు యువకుడే మరి పసిపిల్లల్ని చంపేంత కసాయిగా ఎలా మారాడో. అంతా కాల మహిమ. బ్రహ్మంగారు చెప్పినట్టు కలికాలం విపరీతాల పుట్ట!

ఉరికొయ్య ప్రదేశానికెళ్ళి అంతా పరీక్షించాను. ఎండకి ఎండి వానకి తడిసి రంగు

మారి వుంది. తనకే పాపం తెలీదంటూ జాలిగా చూస్తున్నట్టనిపించింది. దాన్ని దాదాపు పదేళ్ళ క్రితం నేనే ఉపయోగించాను. మళ్ళీ ఇన్నేళ్ళకి.....!

లివర్‌ని కదిపి కుదిపి నాలుగైదుసార్లు ముందుకీ వెనక్కీ నొక్కాను. బాగానే పనిజేస్తోంది. కొత్త తాడు, ఇసుక తెప్పించమని చెప్పి వచ్చేశాను.

"తప్పదంటావా?" ఇల్లాలి ప్రశ్న.

"క్షమాబిచ్చ పెట్టలేదంట..."

"అలాగా. అంతదారుణమైన పనేం జేశాడో!"

"ఇద్దరు పసిపిల్లల్ని కిడ్నాప్ చేసి చంపేడంట. అది కూడా మామూలుగా కాదు పోతపోయాడానికి ఇనుము కరిగిస్తారు చూడు అందులోకి తోసేశాట్ట!"

"వాడమ్మ కడుపు మాడ! ఎంత గోరం! అలాటోడికి పుట్టగతులుండవు...!"

"అందుకే అలాటి శిక్ష వేశారు. ప్లీడర్లూ జడ్జీలూ మామూలోళ్ళు కాదు. పెద్ద పెద్ద లావు లావు పుస్తకాలు చదివినోళ్ళు. ఏది న్యాయం ఏదన్యాయం అన్నది ఆళ్ళకి బాగా తెలుసు. తప్పు చేసినోడు ఎంత గొప్పోడైనా వదలరు. తల తీసి మొలేస్తారు!"

"ఆళ్ళు గట్టోళ్ళు గనుకే అంత గొప్పోరయ్యారు. నాకు తెలీకడుగుతానూ అదేదో దేశంలోలా కరెంటు కుర్చీలో కూకోబెట్టి సిటికెలో నంపెయ్యకుండా ఈ ఉరితీయడాలెందుకు మావా!"

"సిటికెలో సావకూడదనేమో!"

"ఎలా చస్తే ఏంటి? చచ్చేక చేసేదీ వుండదు సాధించేదీ వుండదు గందా!"

మనస్సులో అలజడి జడివాన ఎడతెరపి లేకుండా కురుస్తోంది. స్నానం చేసి పూజామందిరం ముందుకూర్చున్నాను.

'నాకేవిటీ పరీక్ష దేవుడా!' అంటూ మూగగా ప్రార్థించాను. ఈ బాధ్యత నుండి తొలగించమని ఆ దేవదేవుడ్ని అర్థించాను.

భగవద్గీతని చేతిలోకి తీసుకున్నాను. దాన్ని అర్థం చేసుకునేంత చదువు నాకు లేదు. అయినా గొప్ప ఉపశమనం కలిగింది. కర్మ చేసేది నేనైనా చేయించేది ఆ కృష్ణపరమాత్ముడే కదా!

"మళ్ళీ మొదలైందన్న మాట మథన! ఈ పదిరోజులూ నీలో నువ్వే కుమిలిపోతావు కాబోలు!" బాధగా అంది.

జవాబివ్వలేదు. మర్నాడు కొడుకు ఫోన్ చేశాడు.

"ఎందుకొచ్చినపని? మా నాన్న ఫలానా అని నలుగురికీ చెప్పుకోడానిక్కూడా సిగ్గుగా వుంది. ఆ ఛండాలపు వృత్తి మానేసెయ్. కావాల్సిన డబ్బు నేను పంపుతాను...!"

"మానసీ(రా. తాత ఈ పనే చేశాడు గందా. నాకా చదువబ్బ లేదు. మరేం సెయ్యను చెప్పు? అలాగని ఈపని నాకూ ఇష్టం లేదొరేయ్. కాని వారసత్వం తీసుకోక తప్పింది కాదు..."

"అబ్బో అదేదో సింహాసనం దానికి నువ్వు వారసుడివీనూ!"

"నువ్వేమైనా అనుకో. ఇది తప్పించుకోలేను"

కోపం వచ్చినట్టుంది. ఠపీమని ఫోను పెట్టేశాడు.

రోజులు అతి భారంగా నడుస్తున్నాయ్.

గడువు ఒక్కరోజులోకి వచ్చేసింది.

కొత్తతాడుకి 'అతడి' బరువున్న ఇసుక బస్తా తగిలించి 'ట్రయల్' వేశాను. ముడి బిగిసింది. తాడు తెగలేదు. ముడి సర్రున జారటానికి నూనె రాశాను. లివర్ని నాలుగైదుసార్లు కదిపి 'ఉరికి' సర్వం సిద్ధం చేశాను.

వెళ్ళబోతోంటే, "అతడ్నంట ఓ సారి కలవ్వోయ్" అన్నాడు జైలరు.

ఎవర్నన్నట్టు చూశాను.

"త్రీ నాట్ టూ గాడ్ని. రూలు ప్రకారం ఆఖరి కోరికేంటో అడగాలి కదాని అడిగాను. బిర్యానీ తింటాను భగవద్గీత వింటాను అంటాడేమో అనుకుంటే చిత్రంగా నీతో మాట్లాడాలని కోరాడు"

"నాతో ఏం మాట్లాడతాడు సారూ"

"వాడి పిచ్చి వాడిది. మెల్లగా ఉరితీయమని బ్రతిమాల్తాడేమో. ఓసారి వాడి సెల్ దగ్గరి కెళ్ళి కల్సిరా ఓ పనైపోద్ది..."

గతంలో ఎవరూ కోరని కోరిక. మనస్సు చేదుగా అయ్యింది. అయిష్టంగానే

ఏమడుగుతాడోనని క్రిందా మీదా పడుతూ వెళ్ళాను.

ఎవరన్నట్టు చూశాడు.

యమదూతనని చెప్పలేక అతడ్నే చూస్తూ నిలబడ్డాను.

అతడికి ఇరవై ఏడూ ఇరవై ఎనిమిదేళ్ళుండొచ్చు. సన్నగా ఉన్నాడు. భయం భయంగా చూస్తున్నాడు. కరడు కట్టిన నేరస్తుల్లా ఏ కోశానా లేడు. మరా ఘాతుకం ఎందుకు చేశాడో ఎలాంటి ఆవేశానికి లోనై చేశాడో మరెలాంటి మత్తులో కూరుకుపోయి ఇంకెలాంటి ప్రలోభానికి లొంగి పోయి చేశాడో ఆ భగవంతుడికే తెలియాలి!

"మీరెవరూ?" మర్యాదగానే అడిగాడు.

"త... తలారిని..."

ఉలిక్కిపడ్డాడు. అపనమ్మకంగా చూశాడు. ఆపైన ఆశ్చర్యంగా చూశాడు. చూసి చూసి చేతులు జోడించాడు. తబ్బిబ్బు పడటం నా వంతయ్యింది.

"నా మీద కసీ కక్షా చూపొద్దు. నేనే పాపం చెయ్యలేదు. ఆ పిల్లల్ని నేను చంపలేదు. ఎవరు నమ్మినా నమ్మక పోయినా ఇది నిజం..."

ప్రతి నేరస్తుడూ ఇలాగే మాట్లాడతాడు. తన తప్పేం లేదంటూ సర్ది చెప్పుకోజూస్తాడు. కాని ఇతడు మిగతా ఖైదీల్లా లేడు. ఇతడి కళ్ళల్లో నిజాయితీ కన్పిస్తోంది. బాధ తపన పశ్చాత్తాపం ప్రస్ఫుటంగా కన్పిస్తున్నాయి. నోటి తడారిపోతోంటే ఏమనాలో తోచక ఆర్తిగా జాలిగా చూశాను.

"పిల్లల్ని కిడ్నాప్ చేసిన సంగతి నిజమే. వాళ్లని ఓ చోట బంధించాను. కాని వాళ్ళక్కడ్నుంచి మాయమయ్యారు. ఎవరెలా ఆ పని చేశారో తెలీదు. వాళ్ళని ఫర్నేస్‌లో పడేసి నామ రూపాల్లేకుండా చేశారు. అది నా పనే అన్నారు పోలీసులూ కోర్టూ. క్రింది నుంచి పైదాకా అంతా అమ్ముడై పోయి తిమ్మిని బమ్మిని చేశారు. మధ్యలో నన్ను బలి పశువుని చేశారు. నా వేదనని మీరైనా వింటారని నా ఆఖరి మాటల్ని విశ్వసిస్తారని ఆశతో చెబుతున్నాను. నేను నిర్దోషినని ఈ ప్రపంచంగాక పోయినా కనీసం మీరొక్కరూ నమ్మితే చాలు...!"

అతడు తల తిప్పేసుకున్నాడు. అతడి కంట్లోంచి రాలిన కన్నీటి బొట్లు నా దృష్టి నుంచి తప్పించుకోలేదు.

గుండెల్లో ముల్లు దిగినట్టు బాధ. అతడు చెబుతోంది నిజం కావచ్చు. అబద్ధమూ కావచ్చు. వాటితో నాకు సంబంధం లేదు. కాని చలించకుండా వుండలేక పోతున్నాను. అతడికోసం అతణ్ని రక్షించడానికి ఏదేదో చేసెయ్యాలని వుంది. నా అశక్తత నాకు తెలుసు. నా పరిధి నాకు తెలుసు.

సానుభూతి చూపుల్ని మాత్రం ఇచ్చి అక్కణ్నుంచి భారంగా కదిలాను.

ఆ రాత్రి నా రెప్ప మీదకి కునుకు వాలితే ఒట్టు. కనురెప్ప అలా మూస్తే చాలు యముడి భీకర రూపం, కాలపాశపుఝాడింపు, మహిషపు లోహపు గంటల చప్పుడు, కాలు దువ్వుతోన్న దున్న గిట్టల సవ్వడి... నన్ను భయభ్రాంతుణ్ని చేశాయి!

జైలు పక్షులన్నీ నిద్రపోతున్న వేళ.... తెలతెల వారుతూండగా అతణ్ని ఉరికొయ్య ప్రదేశానికి తీసుకొచ్చారు.

జైలు అధికారులు, మేజిస్ట్రేటు, డాక్టరు, పంచనామా కోసం మరికొందరూ వున్నారు.

అతణ్నెందుకు ఉరితీస్తున్నదీ వివరించేరు. చనిపోయే దాకా ఉరి తీయాలన్న తీర్పు అంశమూ చెప్పేరు.

పిమ్మట అతడి పెడరెక్కలు విరిచికట్టాను. తలకి నల్లని ముసుగు వేయబోతూ సూటిగా అతడి కళ్ళల్లోకి చూశాను. అతడి కళ్ళల్లో భయం లేదు. నిరాశ వుంది. ఏవగింపు వుంది. అది ఎవరి మీదో తెలీదు!

మెడకి ఉరితాడు తగిలించి నిర్దేశిత స్థానంలో నిలబెట్టాను.

అతడికీ నాకూ ఎలాంటి సంబంధమూ లేదు. మరెలాంటి ప్రేమ ద్వేషం శత్రుత్వం మా మధ్య లేవు. అయినా అతడి నిండు ప్రాణాలని తీస్తున్నాను. చట్టం కల్పించిన హక్కుతో హత్య చేస్తున్నాను. ప్రాణానికి ప్రాణం ఆటవిక న్యాయమే. కాని నేను నిమిత్త మాత్రుణ్ని. 'దేవుడా నన్ను క్షమించు క్షమించు!'

పాపభీతి గుండెల్ని పిండుతోంది. కన్నీటి మసక తెరలోంచి చూస్తూనే లివర్ పట్టుకున్నాను. అయినా గుండెల్లో బాధాగ్ని సెల వేస్తూనే వుంది. మెదడులో విభిన్న భావాలు భీకర ఘర్షణ పడుతున్నాయి... పాపం! నా కొడుకన్నా ఏడాది పెద్దవాడేమో. అంతే. ఎన్నో ఏళ్ళు బతకాల్సినవాడు. ఏదేదో సాధించాల్సిన వాడు. ఎంత కర్మొచ్చి పడింది. ఇతడి మీద ఆధారపడే తల్లిదండ్రులున్నారేమో. భార్యా బిడ్డలూ వుండే వుంటారు.

వాళ్ళకి దిక్కెవరు? ఏవిటో! అనాలోచితంగా ఆవేశ ఉద్రేకాల్లో కొట్టుకుపోయి నేరాలు చేస్తారు. వారు చదివిన చదువులు కేవలం డబ్బునే గౌరవించడం నేర్పుతాయేమో!

సంబంధిత అధికారి సైగ చెయ్యగానే లివర్ నొక్కాను. అతడి కాళ్ళ క్రింది చెక్క తొలగింది. అతడందులో వ్రేలాడాడు. మెడకి వేసిన ముడి బిగిసింది. మెడ ఎముక విరిగింది. ఊపిరందక కొట్టుకుని కొట్టుకుని ఆగాడు. నాలిక బయటికొచ్చింది. నిక్కరు మల మూత్రాలతో నిండింది.

ఉరి విప్పి శవాన్ని నేల మీద పడుకోబెట్టాం. డాక్టర్ పరీక్షించి చనిపోయినట్టు నిర్ధారించారు. అంతా ఊపిరి పీల్చుకున్నారు.

నాకు మాత్రం ఊపిరి నెవరో బంధించి పట్టుకున్నట్టుగా వుంది. కడుపులో దేవింది. భళ్ళున వాంతి చేసుకున్నాను!

మళ్ళీ మామూలు మనిషవ్వడానికి పదిరోజులు పట్టింది.

"ఇంత కిందా మీదయ్యే వాడికి తలారి పనెందుకూ!" అంటూ ఇల్లాలు సణగుడు మొదలెట్టింది.

ఏమైతేనేం మరో జీవిని చిదిమేశాను. ఆ ఘట్టం ముగిసింది.

మెల్లగా అదంతా మర్చిపోయి రొటీన్లో పడ్డానో లేదో ఓ రోజున టీవీ వాళ్ళొచ్చి నన్ను చుట్టు ముట్టేరు. వాళ్ళు చెప్పిన మాటలకి నా చెవులూ మెదడూ పనిచెయ్యడం మానేశాయి!

నేను ఉరితీసిన యువకుడి అక్క అతడ్ని ప్రోత్సహించి సవతి పిల్లల్ని కిడ్నాప్ చేయించిందిట. బికారిగా తిరుగుతోన్న అతడు అమాంతం లక్షాధికారి అయిపోవచ్చని ఊరించిందిట. అతడు పిల్లల్ని ఎత్తుకొచ్చి బంధించగా ఆమె వాళ్ళని అక్కడ్నుంచి చాటుగా అతడిక్కూడా తెలీకుండా తప్పించి భర్తకప్ప జెప్పిందిట. అతగాడు కన్నబిడ్డలని కూడా చూడకుండా కసాయిగా మారాడట. ఆమె సంతానానికి మాత్రమే తన ఆస్తిపాస్తులు దక్కాలని అంతటి ఘోరాతి ఘోరానికి పాల్పడ్డాడట. కడకి నేరాన్ని ఆ యువకుడి మీదకు తోసేసి బుడి బుడి దీర్ఘాలు తీసి కోర్టుని నమ్మించారట!

అతడ్ని ఉరి తీశాక అతడి అక్క భయభీతురాలై పిచ్చెక్కినట్టు ప్రవర్తిస్తూ నిజానిజాల్ని కక్కిందిట. తీగ లాగగా డొంక కదిలి ఆమె భర్త హంతకుడిగా తెరమీదకొచ్చాట్ట!

ఒకే నేరానికి రెండుసార్లు శిక్షించవచ్చా అని న్యాయకోవిదులు తర్జన భర్జనలు పడుతోంటే మీడియా వారు నా వెంట బడ్డారు.

నిర్దోషిని ఉరి తీసినందుకు మీరెలా ఫీలవుతున్నారంటూ ప్రశ్న మీద ప్రశ్న సంధిస్తున్నారు.

ఏం చెప్పను?

చనిపోయే ముందు రోజు అతడన్న మాటలు చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నాయి. నల్ల ముసుగు వేసే ముందరి అతడి చూపులు కొరడాలై ఒళ్ళు చీలుస్తున్నాయి. అతడి తాలూకు వారి తిట్లు శాపాలై పగబట్టిన పాముల్లా వెంటబడుతున్నాయ్.

అతడి తల్లిదండ్రుల భార్యాబిడ్డల అసహ్యపు చూపులు నన్ను నిలబెట్టి చిత్రవధ చేస్తున్నాయ్. 'నువ్వే నువ్వే ఆ ఘోరం చేశావ' ని నన్ను నిలువునా నిలదీస్తున్నాయ్!

ఎంత దారుణం జరిగిపోయింది. ప్రాణం పోయగల శక్తి లేశమైనా లేకున్నా ఎంతో భవిష్యత్తున్న యువకుడ్ని చంపేశారు! అతడి మీద ఆధారపడిన వారిని అనాథల్ని చేసేశారు! భగవత్ప్రసాదమైన నిండు ప్రాణాన్ని నేలపాలు చేసేశారు!

దీనికి కర్త లెవరు కర్మ లెవరు బాధ్యులెవరు ఆద్యులెవరు?

దేవుడా! నా చేత ఎంత పాపం చేయించావ్! ఈ పాపభారపు శిలువమోస్తూ నేనెలా బ్రతికేది?!

ఇప్పుడు నేనేం చెయ్యాలి. ఎలా నివృత్తి చేసుకోవాలి? సెక్షన్ 302 ని రద్దు చేయమని గొంతు నాళాలు తెగేలా అరిచి చెప్పగలిగితే బావుణ్ణు! ఇంకోసారిలాటి ఘోరం జరక్కుండా ఆపగలిగితే బావుణ్ణు!

నాకంత శక్తి వుందా? చట్టాల బొండు పుస్తకాల మీద తిష్ఠ వేసిన పెద్దలకి నా పీలగొంతు విన్పించగలనా?

నేను అణువుని. ఒకే ఒక్కసారైనా విస్ఫోటించగలిగితే ఎంత బావుణ్ణు!

మథన! నా అణువణువులోనూ నరనరంలోనూ కణకణంలోనూ అగ్నికణాలు రగుల్తూ వేదన... పశ్చాత్తాపం..... అశాంతి... అన్వేషణ... ఆక్రోశం!

నా మస్తిష్కంలో సప్త సముద్రాల ఘోష! గుండెల్లో పొంగిపొరలుతోన్న లావా!

నేను పెద్దగా చదువుకోలేదు. నాకు తెలిసింది ఒకటే విద్య.

ఆ తలారి వృత్తి సాక్షిగా పెద్దలందరికీ మూగ విజ్ఞాపన చేయాలనుకున్నాను. ఆవేశంతో ప్రాణం తీసినందుకు ప్రతిగా ప్రాణం తీయడం కాదు పరివర్తన తేవాలి. జీవిత ఖైదు విధించాలి. ఇదే నా విన్నపం... అస్తమాద్రికి చేరువలో వున్న నేనొక్కడ్నీ బలైనా ఫరవాలేదు. అదో షాక్ ట్రీట్‌మెంట్‌గా పనిచేసి ఇంకే యువతీ మరే యువకుడూ బలి పీఠం ఎక్కకుండా కాపు కాస్తే చాలు!

నిర్ణయం తీసుకోవడం చాలా కష్టసాధ్యమైంది. తీసుకున్నాక ఉక్కు మనిషినయ్యాను.

ఉరి వద్దంటూ ఉరితీసేవాడు ఎలుగెత్తి చాటాలనుకోవడం నిరసన తెలపటం చిత్రం కాదు పెను విషాదం! ఇదీ భగవత్ సంకల్పమేనేమో!

ఏమైతేనేం ఆత్మబలిదానానికి సిద్ధపడ్డాను. చదువుకోని నేలబారు మనిషిని చదువుల్లో తలపండిన వారికి చేతులు జోడించి విజ్ఞప్తి చెయ్యదలిచాను. ఐపిసి 302ని ఉరితీయమని అర్థిస్తూ రాసిన కాగితం చేత బట్టుకుని చెట్టు కొమ్మకి తాడువేసి నా మెడకి బిగించుకున్నాను. నా ప్రయత్నం వమ్ముకాదు. నలుగుర్ని ఉరితీసిన అనుభవం నాకుంది!

**(నవ్య దీపావళి ప్రత్యేక సంచిక 2012)**